క్లుప్తంగా

నిబంధనలకు లోబడి భూ సేకరణ



గుడివాడటౌన్: పట్టణంలో నిర్మించిన టిడ్కో ఇళ్ల మాస్టర్‌ప్లాన్ ప్రకారం ప్రధాన రహదారి నిర్మాణానికి నిబంధనలకు లోబడి భూ సేకరణ చేపడుతున్నామని జాయింట్ కలెక్టర్ అపరాజిత సింగ్ తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం భూ యజమానులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. ప్రధాన రహదారి నిర్మాణానికి మొత్తం 5.55 ఎకరాల భూమి అవసరంకాగా 3.55 ఎకరాలు భూ యజమానుల నుంచి తీసుకోవలసి ఉందన్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం చదరపు గజానికి రూ.2,500 ధర ఉంటే నష్టపరిహారంగా రూ.6,250 చెల్లిస్తామని, రైతులు సహకరించాలని కోరారు. ఇక్కడ లే–అవుట్‌లు వేసి ప్లాట్లు ఏర్పాటు చేసినప్పటికీ అవి ప్రభుత్వ ఆమోదం పొందని కారణంగా వ్యవసాయ భూమిగానే పరిగణిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ పి.పద్మావతి, మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ, తహసీల్దార్ కె.ఆంజనేయులు, అసిస్టెంట్ కమిషనర్ టీవీ రంగారావు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా మహాలక్ష్మి అమ్మవారి జయంతి

తోట్లవల్లూరు: బొడ్డపాడులోని శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో మహాలక్ష్మి అమ్మవారి జయంతి కార్యక్రమం మంగళవారం ఘనంగా జరిగింది. ఆలయ అర్చకుడు అగ్నిహోత్రం శ్రీనివాసమూర్తి రాజ్యలక్ష్మి అమ్మవారికి విశేష పూజలు జరిపి పసుపు కొమ్ముల మాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారిని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు.

అడపా బాబ్జీకి ఘన నివాళి



గుడివాడటౌన్: ఒక మంచి మిత్రుడిని తాను కోల్పోయానని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) అన్నారు. స్థానిక ఏరికపాడులోని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అడపా వెంకట రమణ(బాబ్జీ) ప్రథమ వర్ధంతి ఆయన నివాసంలో మంగళవారం జరిగింది. తొలుత బాబ్జీ కుటుంబ సభ్యులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ.. బాబ్జీ మృతి తనకు తీరని లోటన్నారు. నాయకులు పాలేటి చంటి, బాబ్జీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యాలయంలో......

స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో అడపా బాబ్జీ ప్రథమ వర్ధంతిని పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. నాయకులు తొలుత బాబ్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను నాయకులు కొనియాడారు. నాయకులు మండలి హనుమంతరావు, ఎంవీ నారాయణరెడ్డి, గొర్ల శ్రీను, నయనవరపు శేషుబాబు, సింగిరెడ్డి గగారిన్, వెంపటి సైమన్, కృష్ణమోహన్, ఆంజనేయ ప్రసాద్, చందూరి శేఖర్, మహిళా కార్యకర్తలు మూడెడ్ల ఉమ, రమీజా, సునీత, దేవి, కళావతి పాల్గొన్నారు.

దంపతులపై కేసు నమోదు

కైకలూరు: డ్రెయిన్ వివాదంలో మహిళను దుర్భాషలాడిన దంపతులపై కలిదిండి పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆదర్శనగర్‌లో ఓ దుకాణ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే డీఎన్నార్ మంగళవారం హాజరయ్యారు. ఆ సమయంలో ఆదర్శనగర్‌కు చెందిన షేక్ అమినాబీ(35) ఎమ్మెల్యేకు డ్రెయిన్ సమస్యపై చెప్పింది. దీంతో ఎమ్మెల్యే డ్రెయిన్ నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించడానికి వెళితేసమీప నివాసితులు బసవాని మహేంద్రవర్మ, నాగమల్లేశ్వరీ ఈ ప్రాంతంలో డ్రెయిన్ నిర్మాణం వద్దని ఎమ్మెల్యేతో వాదనకు దిగారు. అనంతరం అమినాబీపై దుర్భాషలాడారు. ఆమె ఫిర్యాదుపై కలిదిండి పోలీసులు భార్యభర్తలపై కేసు నమోదు చేశారు.

నేడు మహిళా దినోత్సవం

పామర్రు: స్థానిక అంకమ్మ తల్లి ఆలయంలో బుధవారం మధ్యాహ్నం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ రంగాల్లో ప్రతిభావంతులైన 10 మంది మహిళలను సన్మానిస్తామని ఘంటసాల కళాపీఠం అధ్యక్ష ఉపాధ్యక్షులు కాటూరి వెంకట మురళీ కృష్ణ, కోటి పాండురంగారావు మంగళవారం తెలిపారు.

ఎంపీటీసీ ఎన్నికపై సమీక్ష

మండవల్లి: మండలంలోని పుట్లచెరువు ఎంపీటీసీ స్థానానికి ఎన్నికపై ఎంపీడీఓ పి.మల్లీశ్వరి మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీ నాయకులతో సమీక్షించారు. ఎంపీడీఓ మల్లీశ్వరి, వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, టీడీపీ, బీజేపీ ప్రతినిధులు ముళ్లపూడి సత్తిబాబు, లావేటి వీరశివాజీ పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణోత్సవాలు

ముదినేపల్లి రూరల్: సింగరాయపాలెం శ్రీలక్ష్మీ నృసింహస్వామి, అమృతేశ్వరుని స్వామి వార్ల వార్షిక కల్యాణోత్సవాలు సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. అనంతరం రథోత్సవం చేపట్టారు. ఆలయ చైర్మన్లు మీగడ నెలబాలుడు, కంతేటి వరలక్ష్మి, ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు పాలకవర్గ సభ్యులు పర్యవేక్షించారు.

మహిళలు.. మీకు జేజేలు

- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం
- వివిధ రంగాల్లో సత్తా చాటుతున్న మహిళలు
- మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్ద పీట



సాధించిన బహుమతులతో నాట్య గురువు శ్రీవల్లి

కైకలూరు: ఈ సృష్టికి మూలం నువ్వే అమ్మా.. నువ్వు లేనిదే లేదు మాకు ఈ జన్మ.. మా వెన్నుతట్టే ధైర్యం నువ్వు.. ప్రతి రోజూ ఒంటి చేత్తో ఇంటిని చక్కదిద్దే ఇరుసవవుతావు.. నీ జోలపాటతో మాకు బతుకునిస్తావు.. అక్షయపాత్రలాగా ఆదరిస్తావు.. అన్నింట్లో సగంగా ఉంటాయి.. అమ్మగా, అక్కగా, చెల్లిగా, వదినగా, పిన్నిగా, మేనత్తగా రూపాలెన్నయినా.. నీ ప్రేమ అనంతం.. అది పొందడం మా అదృష్టం.. మహిళల ఔన్నత్యానికి గుర్తుగా బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకుంటున్న సందర్భంగా వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన మహిళల గాథలు ఇవి...

నాట్యకళాతల్లీ.. శ్రీవల్లీ

నాట్యకళా రంగానికి ఊపిరి పోస్తున్నారు జాతీయ స్థాయి నాట్య కళాకారిణి పసుమర్తి శ్రీవల్లి. కైకలూరులో వందలాది మంది బాలికలకు నాట్యం నేర్పుతున్నారు. విజయవాడలో శ్రీరామచంద్రమూర్తి, మహాలక్ష్మి దంపతులకు జన్మించిన ఈమె డిప్లమో ఇన్ కూచిపూడి, భరతనాట్యం, ఫ్యాషన్ టెక్నాలజీ, సైకాలజీ, సర్టిఫికెట్ మ్యూజిక్ కోర్సులు పూర్తి చేశారు. ఉద్దండులైన చదలవాడ నారాయణరావు, వేంపటి చినసత్యం, రాధేశ్యామ్ వంటి గురువుల వద్ద నాట్యం నేర్చుకున్నారు. భామాకలాపాన్ని దాదాపు 600 సార్లు ప్రదర్శించారు. సింగపూర్‌లో నాట్య ప్రతిభను చాటారు. నాట్య మయూరి, సరస్వతీ, బ్రహ్మ, శశాంక, విజ్ఞాన్, భారతి, విశిష్టరత్న, నాట్య కళారత్న, నృత్య తపస్వీ బిరుదలతో పాటు ఎన్టీఆర్ కళాపురస్కారం, జిలానీఖాన్, నటరాజు వెంకటేశ్వరరావు, ఝాన్సీలక్ష్మీబాయి ఎక్సలెంట్ అవార్డులను అందుకున్నారు. దాదాపు 380 మంది చిన్నారులకు నాట్యాన్ని నేర్పారు. కైకలూరులో కూచిపూడి నాట్యరవళి పేరుతో మహిళలకు నృత్యం, సంగీతం నేర్పుతున్నారు.

అన్న కోసం త్యాగం..



అన్నాచెల్లెళ్ల అనుబంధం సినిమాల్లో చూస్తూ ఆనందించడం పరిపాటి. నిజ జీవితంలో సైతం అరుదుగా జరిగే సంఘటనలు ఇతరులను ఆశ్చర్యానికి, ఆవేదనకు లోనుచేస్తాయి. మహిళా దినోత్సవం సందర్భంగా రక్త సంబంధం కోసం ఓ మహిళ చేసి త్యాగాన్ని మననం చేసుకుందాం. ముదినేపల్లి మండలం చినకామనపూడికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త రామిశెట్టి నాగాంజలి సోదరుడికి రెండు కిడ్నీలు దెబ్బతిన్నాయి. అతను చార్టెడ్ అకౌంటెంట్‌గా పని చేస్తున్నాడు. ప్రాణపాయ పరిస్థితుల్లో నాగాంజలి నేనున్నాంటూ ముందుకువచ్చి అన్నకు కిడ్నీదానం చేసి ప్రాణం నిలబెట్టి రక్తసంబంధాన్ని మరింత బలపరిచింది. ఈమె అంగన్‌వాడీ కార్యకర్తగా కొనసాగుతూ ప్రాజెక్టు, జిల్లా స్థాయిలో ఉత్తమ కార్యకర్తగా అవార్డులు పొంది గ్రామానికి గర్వకారణంగా నిలిచింది. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ మహిళలు పురుషులతో సమానంగా ప్రతిభ చాటడం ఎంతో గర్వంగా ఉందన్నారు.

ప్రజా సేవలో ..



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్న పథకాలను ప్రవేశపెట్టారు. కైకలూరు మహిళా ఎస్సీ సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి పాలనలో తన దైన ముద్రను చాటుతున్నారు. తల్లిదండ్రులు దమ్ము బాలవీరయ్య, ఆనంద బాయ్. తండ్రి భారత రక్షణ సైన్యంలో పనిచేశారు. ఆమెకు ముగ్గురు తమ్ముళ్లు. నవరత్నకుమారి దానం ప్రసాద్ అనే ఉపాధ్యాయుడిని వివాహం చేసుకున్నారు. వైఎస్సార్ సీపీ మద్దతుతో ఎస్సీ మహిళగా మొదటి పర్యాయం సర్పంచ్‌గా విజయం సాధించారు. వాగ్దాటిలో ఫైర్‌బ్రాండ్‌గా పేరుతెచ్చుకున్నారు. ఇంటి బాధ్యతలను నిర్వహిస్తూనే నియోజకవర్గ ప్రధాన కేంద్రమైన కైకలూరు సర్పంచ్‌గా ఉత్తమ సేవలు అందిస్తున్నారు. బడిఈడు పిల్లలు కచ్చితంగా పాఠశాలల్లో చదువుకోవాలని నవరత్నకుమారి చెబుతున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మహిళ సాధికారతకు నిత్యం కృషి చేస్తున్నారని కొనియాడారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



కైకలూరు ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే డీఎన్నార్



సుగుణావతిని సన్మానిస్తున్న కాలేజీ యాజమాన్యం

ముదినేపల్లిరూరల్: ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సింగరాయపాలెం యూపీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎ.రామ్మోహన్‌రావు అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా పాఠశాలలో మంగళవారం ఉపాధ్యాయినులకు సత్కార సభ నిర్వహించారు. ఉపాధ్యాయినులు పి.సామ్రాజ్యం, ఎస్.శాంతకుమారి, కె.లక్ష్మీపాప, ఆర్.ప్రమీలారాణి, జి.మేరీ సుజాతలను సత్కరించారు. ఉపాధ్యాయులు జేవీఎస్ శాస్త్రి, కె.ఆంజనేయప్రసాద్, శ్రీనివాసరావు, గణేష్‌బాబు పాల్గొన్నారు.

జీఈసీలో మహిళా దినోత్సవం

గుడ్లవల్లేరు: శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం గుడివాడ ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి డాక్టర్ చింతపల్లి సుగుణావతి, మరో వైద్యురాలు రోజాను సన్మానం చేశారు. రెడ్‌క్రాస్, రోటరీ క్లబ్బులు సంయుక్తంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు. క్లబ్‌ల ప్రముఖులు శంకరనాథ్, రెడ్డి చౌదరి, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.ప్రసాద్, సలహాదారుడు డాక్టర్ పి.రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళా శక్తి ఎంతో గొప్పది

కైకలూరు: సమాజంలో మహిళా శక్తి ఎంతో గొప్పదని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కై కలూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ బందెల ఆనంద్ ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ రహదారిపై జరిగిన ర్యాలీలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మహిళలకు పదువుల్లో సగం రిజర్వేషన్లు కల్పించారన్నారు.

కైకలూరు నియోజకవర్గంలో నాలుగు మండలాల జెడ్పీటీసీ సభ్యులు మహిళలే కావడం విశేషమన్నారు. ఎంపీపీ అడివి వెంకట కృష్ణ, ఏఎంసీ చైర్‌పర్సన్ దండే పుష్పలత, వైస్ ఎంపీపీ మహ్మద్ జహీర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భట్రాజు శివాజీ, మండల సర్పంచుల ఫోరమ్ అధ్యక్షుడు చెరుకువాడ బలరామరాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లావణ్య, కృష్ణకుమారి, షాహిదాఖానం, సుందరి, కైకలూరు, కలిదిండి మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన అవసరం

కైకలూరు: మహిళా చట్టాలపై అవగాహన అవసరమని సీనియర్ సివిల్ కోర్టు జడ్జి జి.షణ్ముఖరావు మహిళలకు సూచించారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆలపాడు గ్రామంలో మహిళలకు న్యాయ అక్షరాస్యత అవగాహన కార్యక్రమం మంగళవారం ఏర్పాటు చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తెలగంశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జడ్జి మాట్లాడుతూ.. మహిళలపై వేధింపులకు రక్షణగా పలు చట్టాలు అందుబాటులో ఉన్నాయన్నారు. సర్పంచ్ కొప్పుల కృష్ణకుమారి, న్యాయవాదులు బి.ఇందిర, పి.పవన్‌కాంత్, పి.ప్రసన్నకుమార్, దేవేంద్ర, జితేంద్ర, మురళీపవన్, పంచాయతీ ఈఓ డి.లక్ష్మీనారాయణ, శంకరశాస్త్రి, కార్యనిర్వహణాధికారి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.


ఘనంగా మహిళా దినోత్సవం

తోట్లవల్లూరు: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యాన అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా జరిగాయి. స్థానిక మండల పరిషత్ ఆదర్శ పాఠశాలలో మండలంలోని పలు పాఠశాలలకు చెందిన మహిళా ఉపాధ్యాయులను ఆ సంఘం రాష్ట్ర కౌన్సిలర్ ఆర్.రామారావు సత్కరించారు.

వివక్షలేని సమాజ స్థాపనకు కృషి చేయండి

కైకలూరు: మహిళలపై వివక్షలేని సమాజ స్థాపనకు కృషి చేయాలని ఎంపీపీ కృష్ణ అన్నారు మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ రామలింగేశ్వరరావు, ఈఓపీఆర్డీ రవిశంకర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భట్రాజు శివాజీ, ఎంపీటీసీ స్వాతి పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి



గుడివాడలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

గుడివాడటౌన్: పరిపాలనాదక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందనడానికి విశాఖలో జరిగిన పారిశ్రామిక సమ్మిట్ నిదర్శనమని వైఎస్సార్ సీపీ నాయకులు పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం నాయకులు సమ్మిట్ విజయవంతం అవడాన్ని పురస్కరించుకుని సంబరాలు చేశారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఎంవీ నారాయణరెడ్డి, పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, మాజీ కౌన్సిలర్లు వీరిశెట్టి నరసింహారావు, పి.రమేష్, మాదాసు వెంకట లక్ష్మీకుమారి, జ్యోతుల సత్యవేణి, వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు అలీబేగ్ పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి రానివ్వొద్దు



మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ఉమామహేశ్వరరావు

కైకలూరు(కలిదిండి): వేసవి నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని కలిదిండి ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ మంచినీటి ఎద్దడి కలిగిన గ్రామాలను గుర్తించడానికి ప్రత్యేక కమిటీని నియమించామన్నారు. వివిధ శాఖల పనితీరుపై సమీక్ష చేశారు. వైస్ ఎంపీపీలు కనకదుర్గారాణి, నాగలక్ష్మి, ఎంపీడీఓ సీతారాంకుమార్, తహసీల్దార్ తేజోమణి, ఈఓపీఆర్డీ శ్రవణ్‌కుమార్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి



బొమ్మినంపాడులో బ్రోచర్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

ముదినేపల్లిరూరల్: గ్రామాల్లోని స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) తెలిపారు. మండలంలోని బొమ్మినంపాడులో గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించాలని స్థానికులు కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని పలు సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో అభివృద్ధి పనుల కోసం ముఖ్యమంత్రి జగనన్న రూ.20 లక్షల చొప్పున నిధులు కేటాయిస్తున్నట్లు చెప్పారు. ప్రధాన కూడలిలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు చేశారు. అనంతరం దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి, వంగవీటి మోహన రంగా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, కలిదిండి ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు ఈడే వెంకటేశ్వరమ్మ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైస్ ఎంపీపీలు చొప్పర్ల సునీత, రాచూరి రాధా, ఎంపీటీసీ సభ్యురాలు దాసరి అరుణకుమారి, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మోట్రు ఏసుబాబు, నేతలు పాల్గొన్నారు.

బాలమ్మకు నృత్య నీరాజనం



కూచిపూడి నృత్యం చేస్తున్న ప్రొఫెసర్లు

కూచిపూడి(మొవ్వ): శ్రీ గంగా బాలా త్రిపుర సుందరీ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి వార్ల 260వ కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని కూచిపూడిలోని శ్రీ సిద్ధేంద్రయోగి కూచిపూడి నాట్య కళావేదిక పై కళాకారురులు కూచిపూడి నృత్యాంశాలను ప్రదర్శించి అమ్మవారికి నృత్యనీరాజనాలందించారు. కళారత్న డాక్టర్ వేదాంతం రాధేశ్యాం నిర్వహణలో ఆరో రోజైన మంగళవారం సాగిన కూచిపూడి నృత్యాంశాలు అలరించాయి. శ్రీ అఖిల భారత కూచిపూడి నాట్య కళామండలి అధ్యక్షురాలు, ప్రముఖ కూచిపూడి నాట్యాచార్యులు మంజు భార్గవి, నాట్యాచార్యులు డాక్టర్ వేదాంతం రాధేశ్యాం, డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి, డాక్టర్ చింతా రవిబాలకృష్ణ, సేవ్ కూచిపూడి డైరెక్టర్ పెదప్రోలు భావన, ఆలయ కమిటీ బృందంతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ సురభి లక్ష్మీశారద, శిష్యురాలు హేమలత ప్రదర్శించారు. కూచిపూడి డైరెక్టర్ పెదప్రోలు భావన నేతృత్వంలో శారద కళాక్షేత్రం హైదరాబాద్ వారి శిష్యబృందం శ్రీ కాత్యాయని కూచిపూడి నాట్యాలయ నాట్యాచారిణి పోచంపల్లి మంజుల, శిష్యబృందం, ఘంటసాల పవన్ శిష్యబృందం, హవీషాచౌదరి నేతృత్వంలో శిష్య బృందం, నాట్యాచారిణి నరేంద్ర పావని శిష్యబృందం, విశాఖపట్నంకు చెందిన వి.జగన్నాథరావు బృందం ప్రదర్శించారు. కళాకారులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను అందచేశారు. శ్రీనృత్యకళానిలయ అకాడమీ నాట్యాచార్యులు జి.శైలశ్రీ బృందం ప్రదర్శించారు. వీరికి నట్టు వాంగం సత్యానందిని, గాత్రం కుమార సూర్యనారాయణ, మృదంగం పసుమర్తి హరినాథ్, ఫ్లూటు కుమార్ బాబులు సహకరించి ప్రదర్శనను రక్తికట్టించారు.

అసంక్రమణ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

తోట్లవల్లూరు: అసంక్రమణ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తోట్లవల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సాయిప్రసన్న సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో జనఔషధి దివస్ కార్యక్రమం మంగళవారం జరిగింది. మధుమేహం, బీపీ ఉన్న రోగులకు నెలకు సరిపడా మందులను అందజేశారు. సీహెచ్ఓ కోటేశ్వరమ్మ, ఎంపీహెచ్ఈఓ మాణిక్యం, ఎంపీహెచ్ఎస్ అనిల్‌కుమార్, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆడ పిల్లలను పురిటిలోనే చంపకండి



గుడివాడ కోర్టు ప్రాంగణంలో మాట్లాడుతున్న జడ్జి రజిని

గుడివాడటౌన్: ఆడపిల్లలను పురిటిలోనే చంపే సంస్కృతిని సమాజం విడనాడాలని 11వ అదనపు జిల్లా జడ్జి జి.రజిని సూచించారు. స్థానిక కోర్టు ప్రాంగణంలో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మగ పిల్లలను, ఆడ పిల్లలను సమానంగా చూసినప్పుడే మహిళా సమాజానికి న్యాయం జరుగుతుందన్నారు. కోర్టులోని మహిళా సిబ్బందికి నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి ఎ.పూర్ణిమ, జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ కిషోర్ కుమార్, మేజిస్ట్రేట్ కె.నాగలక్ష్మి, డాక్టర్ వసుంధర, మానవత సంస్థ కార్యదర్శి డి.సరస్వతి, ఎన్.ప్రసన్నలక్ష్మి, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక ఏఎన్నార్ కళాశాలలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 500 మందికి వీనస్ హాస్పిటల్ సౌజన్యంతో బ్లడ్ గ్రూప్, మధుమేహం, రక్తహీనత పరీక్షలు చేశారు. డాక్టర్ కొల్లి చందన, బీఎస్ఎస్ పద్మజ, పి శ్రీదేవి, టి వీణ, గ్రీష్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ భవనాన్ని తొలగించవద్దని వినతి



ఎమ్మెల్యే నానికి వినతిపత్రం సమర్పిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

గుడివాడటౌన్: స్థానిక బొమ్ములూరు రోడ్డులోని లయన్స్ మల్టీ సర్వీస్ సెంటర్ (కంటి వైద్యశాల) భవనాన్ని తొలగించవద్దని లయన్స్‌క్లబ్ ప్రతినిధులు గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని)ని కోరారు. రాజేంద్రనగర్‌లోని ఆయన నివాసంలో మంగళవారం వినతి పత్రాన్ని సమర్పించారు. దాతల సహకారంతో నిర్మించిన భవనమని, గత కొంతకాలంగా పేదలకు సేవలందిస్తున్నామని వారు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన కొడాలి నాని మాట్లాడుతూ భవనం నిర్మాణానికి ముందే సీఆర్డీఏ ఈ ప్లాన్ అప్రూవల్ చేసినందున మార్చే అవకాశంలేదన్నారు. భవనానికి నష్టపరిహారం చెల్లించే విషయంలో తాను పూర్తి సహకారం అందిస్తానని, ప్రత్యేక స్థలం సూచిస్తే దానిని కేటాయించడానికి కూడా తాను కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు వల్లూరుపల్లి సుబ్రహ్మణ్యేశ్వరరావు, కృష్ణమోహన్, కొడాలి వెంకటేశ్వరరావు, అడబాల అప్పారావు, వై.కృష్ణారావు పాల్గొన్నారు.

స్థలం మంజూరు చేయించండి..

టైలర్స్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయ నిర్మాణానికి స్థలం మంజూరు చేయించాలని అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే కొడాలి నానికి మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యే కొడాలి నాని మాట్లాడుతూ అనుకూలమైన ప్రభుత్వ స్థలం గుర్తిస్తే తప్పక సహకరిస్తానన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు లంకపల్లి లాజరు, కార్యదర్శి జన్ను శ్రీనివాసరావు, రసూల్ బేగ్, సత్యనారాయణ, ఎం మంగరాజు, పి.నరసింహరావు పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహునికి చందనోత్సవం

కైకలూరు: రాష్ట్రంలో 50వ ధర్మక్షేత్రంగా విరాజిల్లుతున్న వరహాపట్నం శ్రీ లక్ష్మీ నృసింహ దేవాలయంలో స్వామివారికి చందనోత్సవం మంగళవారం అత్యంత వైభవంగా జరిగింది. దేవాలయంలో 121వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 5 నుంచి 9 వరకు ఘనంగా నిర్వహిస్తున్నారు. స్వామివారికి విశేష పూజలు, హోమాలు చేపట్టిన అనంతరం రథోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ ఈవో వీఎస్‌కే.శేఖర్ మాట్లాడుతూ బుధవారంతో బ్రహ్మోత్సవాలు ముగిస్తాయన్నారు. బుధవారం అఖండ అన్నసమారాధన జరుగుతుందన్నారు.

బైక్‌లు ఢీ కొని ఇద్దరికి గాయాలు

తోట్లవల్లూరు: కరకట్టపై రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులు గాయపడిన సంఘటన మండలంలోని వల్లూరుపాలెం సమీపంలో జరిగింది. అవనిగడ్డ నుంచి విజయవాడ వైపు బైక్‌పై వెళుతున్న వ్యక్తి, విజయవాడ నుంచి అవనిగడ్డ వైపు బైక్‌పై వస్తున్న వ్యక్తి ఎదురెదురుగా ఢీకొట్టుకున్నారు. ఈ ప్రమాదంలో ఇద్దరు గాయపడటంతో పోలీసులు క్షతగాత్రులను విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలు సేకరించి కేసు నమోదు చేస్తామని ఎస్ఐ రమేష్ తెలిపారు.